
కథ

# తీరిన బెంగ

స్వాతి శ్రీపాద

**సాయంకాలం అతను ఇంటికి వస్తూనే ఇళ్ళవేట మొదలు.**

**అయినా నెలన్నర గడచిపోయినా ఏం ప్రయోజనం లేకపోయింది. అయితే ఇల్లు నచ్చితే అద్దె నచ్చకపోవడం, అద్దె నచ్చితే ఇల్లు దరిద్రంగా వుండటం. వచ్చే సంపాదనలో మూడో వంతు అద్దెకు ఖర్చు పెట్టక తప్పని స్థితి.**



ఒక్కడి ఆదాయంలో అంతకుమించి వెచ్చించటమూ భారమే మరి. ఇంకా నా పిహెచ్‌డి పూర్తవడానికి ఆర్నెల్లు పట్టవచ్చు.

పోనీ అలాగని నేను ఒక్కదాన్నే వెళ్ళి చూసేందుకు కొత్త చోటు.

నన్ను నేనే మనసులోనే తిట్టుకున్నాను కూడా... మంచి ఇల్లు దొరికేవరకూ ఆగకుండా ఇలా పెళ్ళవుతూనే అలా పరుగెత్తుకు వచ్చినందుకు.

అందుకే ఆ బ్రహ్మచారి కొంప, ఒక్క గదిలో నెలన్నరగా సరిపెట్టుకోవలసి వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో, సిటీ నడిమధ్యన, ఆ పాష్ కాలనీలో ఆ ఇల్లు కనిపించడం మా ఇద్దరి అదృష్టమూ కూడా...

ఇంటిచుట్టూ పూల మొక్కలు, ఇంటి వెనక పెరటితోట... కూరగాయల పాదులు... ఆకుకూరల మళ్ళూ... అన్ని రకాలా అనుకూలమైన గదులు. వంట గదిలో అన్ని సౌకర్యాలూ కాని ఒక్కటే అనుమానం మేం ఈ ఇంటికి అద్దె భరించగలమా అని...

ఇంటిముందు పూలమడులు చూస్తుంటే వచ్చాడు ఇంటి ఓనర్.

వయసు దగ్గర దగ్గరగా ఎనభై దరిదాపుల్లో వుండవచ్చు.

ఓ మోస్తరు పొట్టీ పొడుగూ కాని ఎత్తు... మొహం మీద ఎక్కడ చూసినా ముడతలు పడ్డ చర్మమే... కత్తితో ఇష్టారాజ్యంగా గీతలు గీసినట్టు...

అతనితో మాధవ్ మాట్లాడుతున్నాడు... నా కళ్ళు మాత్రం పూల సొబగులను సవరిస్తున్నాయి... చెవులు వాళ్ళ మాటలను ఆలకిస్తున్నాయి.

"మీకిచ్చేది రెండు గదులు, ఒక వంటగది మాత్రమే... నీ భార్య ఉద్యోగం చేస్తుందా?"

"ఉహూ, లేదండి. ఇంట్లోనే వుంటుంది".

"మరి మరి... ఒక్కదానికీ... ఇంత పెద్ద ఇంట్లో..."

"ఇబ్బందేం లేదు లెండి... నాకు అలవాటే..." నేనే కల్పించుకుని జవాబిచ్చాను.

అద్దె మిగతా కండిషన్లు ఇద్దరూ మాట్లాడుకున్నారు.

నాకు పెద్ద భారం తీరినట్టనిపించింది.

సామానంతా గదినిండా పరచుకు పాకింగ్ అయినా విప్పకుండా నెలన్నరగా నట్టింట్లో చాప పరచుకుని పడుకునే మా అవస్థకు విముక్తి దొరికిందన్న ఆనందం ఉప్పొంగింది.

శని ఆదివారాలు సెలవు గనక ఆ రోజుల్లో మా సామాన్లు చేరవేసుకున్నాము.

విశాలంగా వున్న బెడ్‌రూమ్‌లోనే డబుల్ కాట్ బెడ్స్, డ్రెస్సింగ్ టేబుల్, బీరువా లాంటి పెద్ద సామానులన్నీ వచ్చేసాయి.

కిచెన్‌లోనే ఓ పక్క డైనింగ్ టేబుల్... వాటర్‌ఫిల్టర్, ఫ్రిజ్ అమరిపోయాయి...

కాదంటే కాస్త చిక్కల్లా మా ముందు గదికీ, ఇంటాయన బెడ్‌రూమ్‌కి వున్న పెద్ద కిటికీ. ఆ కిటికీ రెక్కలు ఆ వైపున మూసుకుని వున్నాయి...

మా వైపు బోల్ట్ చెయ్యలేము. సరేలే గ్రిల్ వుండే వుంటుంది... పెద్ద రిస్కేమీ లేదనుకున్నాను.

అయినా అదేమిటో ఇంట్లో ఎవ్వరూ లేకపోయినా మనసంతా దిగులు దిగులుగా గుబులు గుబులుగా అనిపించేది.

వారం రోజులు గడిచాయి, మాధవ్ పొద్దున వెడితే రాత్రి వచ్చేసరికి ఒక్కోసారి ఏడు దాటేది.

ఉదయం అతను వెళ్ళాక మళ్ళీ ఓ గంట పడుకుని లేచి కాఫీ తాగి, తీరిగ్గా పేపర్ చదివేసరికి పనిపిల్ల మాధవి వచ్చేది.

అది ముందు ఇంటి వారింట్లో పని చేసి ఇక్కడకు వచ్చేది.

కామన్‌గా కిటికీ వున్నా ఒక్క మాటా వినిపించేది కాదు...

అదీ నోరు విప్పి ఇంటాయన గురించి ఒక్క మాటా చెప్పనప్పుడు మరీ అనాగరికంగా నేనెందుకు అడగాలని నేనూ అడిగే దాన్ని కాదు...

ఆ ముసలాయన కూడా రోజంతా ఏం చేస్తాడో ఒక్కసారీ కనిపించలేదు. కాస్త శబ్దమూ వినిపించలేదు. మాధవికంటే ముందు గదిలోకి దూసుకువచ్చిన మల్లెల సువాసనకు తలెత్తాను.

పొడుగాటి దాని జడలో నాలుగు వరసల్లో మల్లెల మాల...

పూలు తెల్లగా విప్పారి సువాసనలు వెదజల్లుతున్నాయి.

"ఏమిటే మాధవీ ఈ రోజు పూలన్నీ కోసేసావా... అయినా ఓనర్‌గారు చూస్తే..."

"లేదమ్మా... ఆయనే కోసుకోమన్నారు"

అది కూనిరాగం తీస్తూ ఇల్లూడవటం మొదలెట్టింది.

నేను లేచి వాకిట్లోకి నడిచాను...

ఇంటిముందు ఓ వారగా పెద్ద పసుపు పచ్చ గులాబీ హైబ్రిడ్ మొక్క దానినిండా ఆకు కనిపించనంతగా పెద్ద పెద్ద గులాబీలు...

చాపల్యాన్ని ఆపుకోలేకపోయాను...

ఓ పువ్వు తెంచే ప్రయత్నంలో పెద్ద ముల్లొకటి బొటనవేలి వెనక చర్మాన్ని గాయపరచింది.

కాస్త లోతుగా దిగిందేమో ముల్లు...

రక్తం బొటబొటా కారడం మొదలెట్టింది.

"నీకు పూలంటే ఇష్టమా?"

ఉలిక్కిపడి తలెత్తాను...

గోడవారగా గన్నేరు గుబురు పక్కగా కుర్చీలో వున్న ఆయన్ను మాట వినేవరకూ నేను గమనించనేలేదు.

తొట్రుపడుతూ తలూపాను.

గబగబా లేచి వచ్చి సగం కాడ తెగి వేళ్ళాడుతున్న గులాబీ తుంచి నా చేతి కిచ్చాడు. ఆ ఇవ్వడంలో కావాలనే నా చేతులకు వేళ్ళు తగిలించడం గుర్తించలేనంత అమాయకురాలిని కాదు.

అప్పుడే చూసినట్టుగా "అరెరె... ముల్లు గీసుకుందా?" చొరవగా నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ స్పర్శలో... ఇది అని చెప్పలేని లాలస.

"బాగా లోతుగానే దిగినట్టుంది... నియోస్పోరిన్ పౌడర్ వేసి బాండేజ్ వేసుకో" చెయ్యి విదిలించుకుని లోపలకు వెళ్ళాను.

ఆ సంఘటన చిన్నదే అయినా మనసు వ్యక్తం చెయ్యలేని విహ్వలతకు దిగ్భ్రాంతికి లోనయింది.

వారంపాటు అన్ని తలుపులూ వేసుకుని కూర్చున్నా ఏ మూలనుండో అతను గమనిస్తున్నాడేమోనన్న భయం... అదో రకమైన అభద్రతా భావం...

అయితే ఇవన్నీ అతనితో చెప్పుకోలేని అశక్తత. మొహమాటం.

నన్ను పిరికిదాన్నని హేళన చేస్తాడేమోనని దిగులు...

పుస్తకం పట్టుకున్నా మనసు చదువు మీద లగ్నం కావడం లేదు. ఈజీ చెయిర్ లో కూర్చుని పుస్తకం గుండెలమీద పెట్టుకుని లిప్తపాటు ఓ కునుకు తీసాను.

"ఏం చేస్తున్నావమ్మాయ్?"

దగ్గరగా వినిపించిన ఆ స్వరానికి తుళ్ళిపడ్డాను.

అదిరిపాటుతో తలెత్తాను.

నిజానికి అతను ఆ గదిలో లేడు. కిటికీ తెరిచి అడిగాడు...

జవాబివ్వకుండా కళ్ళప్పగించి చూస్తూండిపోయాను. తెరిచిన కిటికీకి మామూలుగా వుండే గ్రిల్స్ లేవు.

ఆ గదిలోంచి ఈ గదిలోకి ఓ దూకు దూకి వచ్చెయ్యవచ్చు.

"చెయ్యి నొప్పి తగ్గిందా?"


తలూపాను. మాటలకు పెదవులు సహకరించట్లేదు మరి.

"ఈ రోజు కనకాంబరం రంగు గులాబీలు పూశాయి నీకిద్దామని..."

చెంగున ఆ గదిలోంచి ఈ గదిలోకి దూకాడాయన.

ఆకులతో పాటూ తుంచిన ఐదారు పూలు నా చేతిలో పెట్టాడు.

"నీకేపూలు కావాలన్నా తెంపుకో... ఇబ్బందేం లేదు... ఒక్కదానవూ పొద్దెలా పోతుందీ.... మరీ ఇలా గదిలో తలుపు



"ఏం చేస్తున్నావమ్మాయ్?"
దగ్గరగా వినిపించిన ఆ స్వరానికి తుళ్ళిపడ్డాను.
అదిరిపాటుతో తలెత్తాను.
నిజానికి అతను ఆ గదిలో లేడు.
కిటికీ తెరిచి అడిగాడు...
జవాబివ్వకుండా కళ్ళప్పగించి చూస్తూండిపోయాను. తెరిచిన కిటికీకి మామూలుగా వుండే గ్రిల్స్ లేవు.

లేసుకుని కూర్చుంటే..."

జవాబిచ్చేందుకు నా పెదవులు వణుకుతున్నాయి.

ఈ లోగా వీధివాకిలి చప్పుడవటంతో ఆయన తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వచ్చినది మాధవి.

"ఈ రోజు మధ్యాహ్నం వస్తానన్నావుగా?"

"అవునమ్మా... అమ్మా నేనూ మార్నింగ్ షోకి వెళ్దామనుకున్నాము... కాని టిక్కెట్లు దొరకలేదు. మరెందుకని పనన్నా చేసుకోవచ్చుని వచ్చేసా..."

ఆ తరువాత నా జాగర్తలో నేనుండటం... ఒంటరిగా ఇంట్లో వుండకుండా మాధవితో పాటు బయటకు వెళ్ళి ఏ లైబ్రరీలోనో చదువుకుని సాయంత్రానికి ఇల్లు చేరటం... ఇంట్లో వున్నా వీధివాకిలి తెరిచి వుంచటం వగైరాలు చేసేదానను.

నెల దాటాక కావచ్చు ఓ రోజు పని చెయ్యడానికి వచ్చిన మాధవి చెక్కిళ్ళు ఎర్రగా కందివుండటం చూసి అడక్కుండా వుండలేకపోయాను...

"ఎందుకే మొహం అలా బీట్‌రూట్ దుంపలా ఎర్రబారింది... అలర్జీనా?"

"కాదండీ అప్పుడప్పుడు ఇలా అవడం మామూలే..." పన్నెండేళ్ళ మాధవి అతిమామూలుగా తన పని తను చేసుకుపోతోంది.

"దేనికో అలర్జీ వచ్చి వుంటుంది..." నాలో నేనే అనుకున్నట్టుగా అన్నాను. దాని పనులన్నీ అయ్యాక ఇంటికి తాళం వేసి దానితో బయటకు నడుస్తూ-

పద ఒకసారి డాక్టర్ దగ్గర చూపిస్తాను..."

"దేనికమ్మా... అవసరం లేదుగా... గట్టిగా అదుముకుని ముద్దు పెట్టుకుంటే కడుపు రాదటగా... ఇంటయ్యగారే కాదు అమ్మ కూడా చెప్పింది..."

తెల్లబోవడం నా వంతైంది.

"కడుపా... ..."

"అవును డాక్టర్ అవసరం దేనికి మరి... ఆ ముసిలాడి బవిరి గడ్డానికి నా మొహం అలా ఎర్రబారిందనేగా... అది మామూలే... అమ్మకూ తెలుసు.

అప్పుడో ఇప్పుడో ఇలా ముద్దాడి మా సినిమాలకు డబ్బులిస్తాడు... వస్తాను..."

నన్ను నా మానాన వదిలి వెళ్ళిపోయిందది.

నిశ్చేష్టురాలనయి ఎంతసేపలా నిల్చుండిపోయానో..."

ఎలా వెళ్ళి ఎలా ఆ లైబ్రరీ టేబుల్ దగ్గర కూర్చున్నానో నాకే తెలీదు...

కళ్ళు మూసుకున్నా మనసు చుట్టూ అస్పష్టంగా జ్ఞాపకాల సాలెగూళ్ళు.

ఏదో జుగుప్స... నాలో వెర్రితలలు వేస్తున్న వికారం.

"బంగారు బొమ్మలా వుంటుంది. పాపను చూస్తేగాని మా ఆయనకు కొట్టుకు వెళ్ళ బుద్ధి కాదు. మీ చిన్నారిని రోజూ మా ఇంటికి పంపరూ..."

ఊహ తెలిని వయసులో పక్కింటి పర్వతాకారపు రంగారావు పనిమాలా పిలుచుకోవడమే కాకుండా ఒళ్ళంతా కదిలిపోయేలా అదిమిపట్టుకుని ముద్దాడటం... ఉక్కిరిబిక్కిరై శ్వాస అందక కళ వెళపడే తనను చూసి ఏ రకం సంతృప్తి దొరికేదో కాని... ఏదో ఒకటి నా చేతిలో పెట్టి పంపించడం...

స్కూల్లో చదివే రోజుల్లో సామ్రాజ్యం ఇంటికి ఎప్పుడు వెళ్ళినా ఎప్పుడు ఒంటిగా దొరుకుతానా అని ఎదురుచూసే దాని అన్నయ్య సమయం చిక్కగానే బలమైన తన బాహువుల్లో బంధించి పెదవులపై పెదవులాన్చి ముద్దాడటం...

మరచిపోయాననుకున్న గతం మళ్ళీ సజీవంగా ఎదుట నిల్చుని వెక్కిరిస్తున్నట్టుంది.

మళ్ళీ కథ మొదటికి వచ్చిందా... మళ్ళీ ఇంటివేట మొదలెట్టాలా?

ఈ పులి తోలు కప్పుకున్న నక్కల నించి ఎంతకాలం ఇలా పారిపోవడం?

దీనికో పరిష్కారం లేదా...

ఇంటికి వచ్చేసరికి ఆ ముసలాయన తలుపు పక్కగా వాలుకుర్చీలో వాలి సేద దీరుతున్నాడు.

వీలైనంత నిశ్శబ్దంగా తలుపుతీసి లోనికి వెళ్ళాను...

కాఫీకప్పులతో బయటకు వచ్చేసరికి ఆవులిస్తూ కళ్ళు తెరిచాడు.

"తాతగారూ! కాఫీ తాగండి..."

ఓ కప్పు అతనికిచ్చాను. వేడి వేడి కాఫీ గబగబా తాగేసి

"తాతగారూ... రోజూ నేను ఎక్కడికి వెళ్తున్నానని అడిగారు... చెప్పనా... మా వయసువాళ్ళం ఐదారుగురం కలసి స్త్రీ జనోద్ధరణ సంఘాన్నొదాన్ని స్థాపించాం... ఈ రోజు మా సెక్రెటరీ ఇంట్లో పని చేసే పిల్లను పక్కింటి ముసలివాడొకడు సతాయిస్తున్నాడని విన్నాం... ఉదయం నించీ ఇద్దరి స్టేట్ మెంట్స్ రికార్డ్ చెయ్యడమే అయ్యింది...

అయినా కాటికి కాళ్ళు చాపుని అదేం పొయ్యేకాలం తాతగారూ... అభం శుభం తెలియని చిన్నారులను అలా వేధించడం..."

నా మాటలు పూర్తి కాకుండానే అతని మొహం పాలిపోయింది.

నా ఉద్దేశ్యం అతనికర్థమయింది.

మారు మాటాడకుండా లేచి వెళ్ళిపోయాడు.

వారం తిరక్కుండా కిటికీ స్థలంలో వెలసిన గోడ సాక్షిగా నా బెంగ తీరిపోయింది.

# పిల్లల కడుపులో పాములుంటే...?

ఆరోగ్యం సరిగా వున్న పిల్లల్లోనే ఎదుగుదల సరిగా వుంటుంది. అందువల్లనే వారి పెంపకంలో శ్రద్ధ వహించాలి. పిల్లల ఆరోగ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనేక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వారి ఆహార పానీయాల విషయంలో అజాగ్రత్తగా ఉంటే ఏదో ఒక సమస్యకు లోనవుతారు. కనుక నిరంతరం మెలకువతో వ్యవహరించాలి. వారు ఏమాత్రం చిన్న నొప్పి అన్నా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. సాధారణంగా చాలామంది పిల్లలు పొట్టలో పాములు ఉంటాయి. కొందరి పెద్దవాళ్ళ కడుపులో కూడా ఉంటాయి. దీని వల్ల వారు కడుపునొప్పితో బాధపడుతుంటారు. ఆకలి సరిగా ఉండదు. అడపాదడపా విరేచనాలు అవుతుంటాయి.

కడుపులో పాములు ఉండడమంటే జీర్ణకోశం పేగులో ఉండడమేనని భావించాలి. వీటిని వైద్య పరిభాషలో యూస్కారిస్ లుంబ్రికాయిడ్స్ అని, సాండ్ వార్మ్ అని అంటారు. ఇవి దాదాపు పది పన్నెండు అంగుళాల పొడవు ఉంటాయి. మనం తీసుకునే ఆహారాన్ని ఇవి ఆరగించి చిన్నపేగుల్లో ఎక్కువగా ఉండిపోతాయి. కనుకనే కడుపులో పాములున్న వారు ఎంత తిన్నా నీరసంగా ఉంటారు. ఇలా కడుపులో పాములు ఉన్న పిల్లలు నీరసంగా, బలహీనంగా ఉండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. తరచుగా కడుపు నొప్పి కూడా వస్తుంటుంది. ఈ పాముల్లో ఆడ, మగ పాములు ఉంటాయి.

## ఆరోగ్యం



వీటిలో ఆడపాము సగటున రోజుకు రెండు లక్షల గుడ్లు పెడుతుంది. ఇవి చాలా వరకు విరేచనం ద్వారా బయటకు వస్తాయి. ఇలా బయటకు వచ్చిన గుడ్లు మరీ ఎక్కువ ఎండ ఉంటే తప్ప అంతరించవు. కనుక మలం ఎండిపోగానే ఆ గుడ్లు గాలితోపాటు ఎగిరి మనం తినే ఆహార పదార్థాల మీద, ఫలాల మీద వాలుతాయి. అలాగే ఈగల ద్వారా అనేక పదార్థాల మీదకు వస్తాయి. కనుక పండ్లు ఫలాల్ని నీళ్ళతో శుభ్రం చేయకుండా తీసుకున్నా, ఇతర ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్త పాటించకున్నా ఆ గుడ్లు మనం తీసుకునే ఆహారం ద్వారా కడుపులోకి చేరుతాయి. అందువల్ల తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. శుభ్రతకి ప్రాధాన్యమివ్వాలి.

సాధారణంగా జీర్ణకోశంలోకి చేరిన గుడ్ల నుంచి చిన్నచిన్న పాములు బయటకు వస్తాయి. అవి జీర్ణకోశం నుంచి లింఫాటిక్ నాళాల ద్వారా లివర్, శ్వాసకోశాలకు చేరుకుంటాయి. శ్వాసకోశాల నుంచి గాలి గొట్టంలోకి ప్రవేశించి తిరిగి అన్నవాహికలోకి ఈ పాములు చేరుతాయి. శ్వాసకోశంలోకి ప్రవేశించినప్పుడు కొంతమందిలో ఊపిరితిత్తుల్లో నొప్పి అనిపిస్తుంది. అలాగే కడపులో పాములుంటే వికారంగా అనిపిస్తుంది. ఆకలి లోపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కొందరిలో స్పష్టంగా కనిపిస్తాయి. మరికొంతమందికి అనుకోకుండా వాంతులు అవుతుంటాయి. ముఖ్యంగా పిల్లల విషయంలో కడుపులో పాములు ఎక్కువగా ఉంటే వారు బలహీనంగా కనిపిస్తారు. తరచుగా జ్వరపడుతుంటారు. కడుపు ఎత్తుగా కనబడుతుంది. బరువు తగ్గుతారు. వారి ఎదుగుదలపై దీని ప్రభావం ఉంటుంది. పిల్లలకి ఇచ్చే ఆహారం విషయంలో శుభ్రతని పాటించకపోతే వారు ఈ సమస్యతో తల్లడిల్లిపోయే పరిస్థితులు ఎదురవుతాయి.

ముఖ్యంగా చిన్నపిల్లలు కడుపులో నొప్పి, వికారం, ఆకలి లేకపోవడం, ఎక్కువసార్లు విరేచనం కావడం వంటి సమస్యలతో బాధపడుతుంటే వాళ్ళ కడుపులో పాములు ఉన్నాయని అనుకోవాల్సిందే. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది. హోమియో వైద్యవిధానంలో ఈ సమస్య పరిష్కారానికి తగిన మందులు ఉన్నాయి. రోగి వయసు, పరిస్థితి, రోగ లక్షణాల్ని బట్టి హోమియో వైద్యంలో మందులు ఇస్తారు. అందువల్ల ఏవో మాత్రలతో తగ్గిపోతుందని భావించకూడదు. రోగిని స్వయంగా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి. ముఖ్యంగా చిన్నపిల్లల్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి సమస్యను కూలంకషంగా వివరించాలి. ఏయే కారణాల వల్ల ఈ సమస్య వస్తుందో డాక్టర్ గ్రహిస్తారు. అందుకు అనుగుణంగా తగిన మందులు ఇస్తారు. మందులు వాడుతూ, శుభ్రమైన ఆహారం స్వీకరిస్తే కోలుకుంటారు. తద్వారా వారి ఆరోగ్యం కుదురుగా ఉంటుంది.

- డాక్టర్ దండెపు బస్వానందం